ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
1
ఆదివారం 4 మే 2025



వాణిజ్య కేంద్రంగా పూలే పార్క్


పార్క్‌లో ఎగ్జిబిషన్ పరికరాలు

- కార్యక్రమాల నిర్వహణతో దెబ్బతింటున్న వాకింగ్ ట్రాక్
- రోజుల తరబడి వాకర్స్‌ను అనుమతించని నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): అహ్లాదంతో పాటు వాకింగ్ ట్రాక్‌తో ఆరోగ్యాన్ని అందించాలని నగరంలోని ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే పార్కును వాణిజ్య కేంద్రంగా మార్చుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా క్రీడా మైదానంగా ఉన్న జ్యోతి బాపూలే మైదానాన్ని స్మార్ట్ సిటీలో భాగంగా ఆరు కోట్ల రూపాయల నిధులతో ఆధునీకరించారు. అందులోనే వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ అధికారులు పార్కు నిర్వహణకు కాంట్రాక్టర్‌కు లీజుకు ఇచ్చారు. కాంట్రాక్టు పొందిన సదరు ఏజెన్సీలు నిబంధనలను మీరి పూర్తిగా వాణిజ్య కేంద్రంగా జ్యోతిబాపూలే పార్కును మారుస్తున్నారు. దీంతో పార్కుకు వచ్చే నగరపౌరులకు, వాకింగ్ ట్రాక్‌పై ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పార్కులో ఫుడ్ స్టాల్స్ ఏర్పాట్లు

రంజాన్ సందర్భంగా జ్యోతిబాపూలే మైదానంలోనే హలీం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో 30 రోజులపాటు ఈ మైదానంలోని ట్రాక్ పూర్తిగా వాకింగ్‌కు అనువుగా లేకుండా పోయింది. స్టాల్స్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో ఇక్కడే వంటకాలు, ఆహార పదార్థాలు, వ్యర్థ పదార్థాలతో పార్కు మొత్తం దుర్గంధభరితంగా మారింది.

(మిగతా 4వ పేజీలో)

పార్కులో ఎగ్జిబిషన్ సామగ్రి

పార్కును కాంట్రాక్టు పొందిన వ్యక్తులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు. దీంతో పార్కు మధ్యలో ఉన్న మైదానంలో ఎగ్జిబిషన్ సామగ్రిని పెద్ద మొత్తంలో దించారు. ఈ సామగ్రిని తీసుకువస్తున్న పెద్దపెద్ద లారీలు, ట్రక్కులు పార్కులో నిర్మించిన వాకింగ్ ట్రాక్ పై నుండి వెళ్లడంతో వాకింగ్ ట్రాక్ పూర్తిగా దెబ్బతింటుంది. అలాగే 90 రోజులపాటు ఎగ్జిబిషన్‌కు ఈ పార్కును ఇవ్వడంతో ఇందులో కోట్లు వెచ్చించిన నిర్మించిన వివిధ సుందర ప్రదేశాలు, మొక్కలు దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే ఈ వేసవిలో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కు నగరవాసులకు దూరం కానుంది. 90 రోజులపాటు ఈ వాకింగ్ ట్రాక్ కూడా వాకర్స్‌కు అందుబాటులో లేకుండా పోతుంది.


ధ్వంసమైన వాకింగ్ ట్రాక్

నేడు నీట్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు.. 2,975 మంది విద్యార్థులు
- మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష
- 11 నుంచి 1:30 వరకు కేంద్రంలోకి అనుమతి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

నీట్ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్ష జరగనుంది. 2,975 మంది హాజరుకానున్న ఈ పరీక్ష కోసం జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్సారార్ డిగ్రీ కాలేజీలో 720 మంది, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ లో 648, తిమ్మాపూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో 480, కేంద్రీయ విద్యాలయంలో 384, అంబేద్కర్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో 288, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో 240, చింతకుంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 215 మంది నీట్ రాసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతిపరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించారు.



ఆలస్యమైతే అనుమతించరు..

పరీక్ష రాసేవారిని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు మాత్రమే కేంద్రంలోనికి అనుమతిస్తారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా హాల్‌లోకి వెళ్లడానికి ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందుగానే చేరుకోవాల్సి ఉంటుందని జిల్లా యంత్రాంగం తెలిపింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డుపై ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, అదనంగా మరో పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అతికించాలని సూచించారు. మరో పాస్‌పోర్టు సైజ్ ఫోటోతోపాటు అప్‌డేటెడ్ ఆధార్‌కార్డును, తాజా ఐడీ ప్రూఫ్‌ను వెంట తెచ్చుకోవాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులు అంగవైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాల్సి ఉంటుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర వస్తువులను తీసుకురావద్దని, అవసరమైన పెన్నులను పరీక్షా కేంద్రంలోనే ఇస్తారని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ పరికరాలు అనుమతించరు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది.

అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తిమ్మాపూర్: నీట్ అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం ఎల్ఎండీ కాలనీ లోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పెన్నులు, పెన్సిళ్లను, ఇతర ఎలాంటి వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులకు అవసరమయ్యే పెన్నులను నిర్వాహకులే సమకూరుస్తారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. 087-2997247 నంబర్‌కు ఫోన్ చేసి అభ్యర్థులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇటీవల ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి ఓ ప్రకటనలో సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు, సూచనలు పాటించాలన్నారు. చిన్నారులు, వృద్ధుల విషయమంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, వారికి మంచి నీరు, గ్లూకోజ్, ఎలక్ట్రోరల్ పౌడర్ వంటివి అందించాలని అన్నారు. వీలైనంత వరకు వృద్ధులు, చిన్నారులను గాలి ఆడే ప్రదేశాల్లో ఉండేలా చూడా లని తెలిపారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ మరణాలు అరకట్టవచ్చని, ఎండతీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందని తెలిపారు. చెమట, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి, ఎండలో బయటకు వెళ్లినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా గొడుగు వాడడం, తెలుపురంగు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారను. తలకు టోపీ కానీ రుమాలు కానీ వాడాలన్నారు. వేడిగాలులు తగలకుండా చూసుకోవాలని, ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దని సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచి నీరు తాగాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకువెళ్లాలని, చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తూ ఉండాలని సూచించారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, మజ్జిగ వంటివి సరఫరా చేయాలని కోరారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్థన స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాల్లో అవసరమైన షెల్టర్లు, తాగు నీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థుల యూనిఫామ్స్ నాణ్యతగా కుట్టాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల యూనిఫామ్స్ నాణ్యంగా కుట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లిలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూనిఫామ్స్ తయారీ కేంద్రాన్ని కలెక్టర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబుల్ స్టిచ్ చేయాలని, నిర్ణయించిన ధర కంటే రెండు రూపాయలు అదనంగా చెల్లిస్తామని, నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. సకాలంలో కుట్టడం పూర్తి చేయాలన్నారు. కుట్టు పని పూర్తి అయిన తరువాత మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రతి యూనిఫామ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. కొత్తపల్లి పరిధిలోని 13 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్ ఇక్కడ కుట్టిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీఏ పీడీ వేణుమాధవ్ పాల్గొన్నారు.


కొత్తపల్లిలో యూనిఫామ్స్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఇందిరమ్మ మోడల్ ఇల్లు పరిశీలన

తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఐదు లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లును కలెక్టర్ పమేలా సత్పతి శనివారం పరిశీలించారు. మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న మోడల్ ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఇళ్లను చూసి లబ్ధిదారులు ఒక ఆలోచనకు వస్తారన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గ్రంథాలయాన్ని ఆమె పరిశీలించారు. ఇక్కడ ఉన్న ఖాళీ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రం, క్యాంటిన్ వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ గంగాధర్, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో
వినూత్న బోధన
- పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం
- బొమ్మలు, ఇతర సామగ్రితో పాఠాలు
3

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు, పాల్గొన్న జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ బాధ్యులు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేవరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ముఫతి మహమ్మద్ యూనస్ కాస్మి, కో కన్వీనర్ హఫీజ్ రిజ్వాన్, హఫీజ్ మహమ్మద్ వసీముద్దీన్, మహమ్మద్ మునీబుద్దీన్, మౌలానా ఖాజా కలీముద్దీన్, మౌలానా ఖాజా అలీ ముద్దీన్, ముఫతి గయాస్ మొహియుద్దీన్, మహమ్మద్ ఖైరుద్దీన్, మొహమ్మద్ హఫీజ్ ఉల్లా, షా ఖాద్రి, షోయిబ్ అహ్మద్‌ఖాన్, ముఫతి సాదిక్ అలీ, ఉమర్ ఫారూసి కాస్మీ, రబ్బానీ, బి వెంకట మల్లయ్య, జి రాజయ్య, జయరాజ్, ప్రశాంత్, క్రిస్టఫర్, సర్దార్ బిషన్ సింగ్, అబ్బాస్ సమీ, ఎండీ తాజుద్దీన్ పాల్గొన్నారు.

చలో.. ఆటలు ఆడేద్దాం..

- నగరపాలక సంస్థ, క్రీడాశాఖల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాలు
- ఈ నెల 9 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- 12 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా యువజన క్రీడాశాఖల ఆధ్వర్యంలో ఈ వేసవిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఇటీవల నగర పాలక సంస్థ ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ వేసవి క్రీడా శిక్షణా శిబిరాల వివరాలను ప్రకటించారు. ఈ నెల 12 నుంచి ఈ జిల్లా శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు.

జిల్లాలోని ఆసక్తిగల విద్యార్థులు 4వ తరగతి నుంచి 12వ తరగతి లోపు(ఇంటర్) చదివే వారు అర్హులు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు విద్యార్థులు ఆసక్తిగల క్రీడాంశాన్ని ఎంచుకొని, దరఖాస్తు ను పూర్తిచేసి సమర్పించాలి. దానికి ఆధార్ కార్డు జిరాక్స్‌ను జతచేసి, దరఖాస్తుపై ఒక ఫోటో ను అతికించి జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అందించాల్సి ఉంటుంది.


ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతన్న విద్యార్థులు(ఫైల్)

16 క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ...

గతంలో 25 క్రీడాంశాల్లో ఉచిత శిక్షణను అందించిన నగరపాలక సంస్థ ఈ సంవత్సరం 16 క్రీడా అంశాల్లో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నది. ఆర్చరీ, అథ్లెటిక్స్ బాస్కెట్‌బాల్, క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, రెజ్లింగ్, జూడో, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, కరాటే, యోగా మొత్తం 16 క్రీడాంశాల్లో శిక్షణను అందించనున్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం...

ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తారు. ఈ శిబిరాల్లో పాల్గొనే చిన్నారులకు క్రీడాకారులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని ఉచితంగా అందించనున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు..

\- చాహత్ బాజ్‌పాయ్, నగరపాలక సంస్థ కమిషనర్



క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాం. ఈ శిక్షణలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సాధన చేయాలి. 16 క్రీడాంశాలను ఎంపిక చేసి నగరపాలక సంస్థ క్రీడాశాఖ సహకారంతో శిక్షణ తరగతులను నిర్వహించనున్నాం.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి...

\- నందెల్లి మహిపాల్, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షులు



నగరపాలక సంస్థ జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరాల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా జట్లకు, రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించాలి. విద్యార్థులకు వేసవి క్రీడా శిఖరాలను నిర్వహిస్తున్న నగరపాలక సంస్థకు జిల్లాలోని క్రీడా సంఘాల తరపున ధన్యవాదాలు.

రేపటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

కరీంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జిల్లాలో ఈ నెల 5న ప్రారంభం కానుంది. జూన్ 13 వరకు జిల్లాలోని గుర్తించిన గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. పీజేటీఏయూ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు పనిదినాల్లో నిర్వహించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసింది. తక్కువ యూరియా వాడండి.. సాగు ఖర్చును తగ్గించండి.. అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి.. నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి, రశీదులను భద్రపరచండి.. కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందండి.. సాగునీటిని ఆదా చేయండి.. భావితరాలకు అందించండి.. పంట మార్పిడి పాటించండి.. సుస్థిర ఆదాయాన్ని పొందండి.. చెట్లను పెంచండి.. పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదాలతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా సలహాలు, సూచనలు అందజేయనున్నారు. కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఈ నెల 5న ప్రారంభమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసినట్లు ఏసీపీ ఎం రమేష్ తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులసమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రశాంత్‌నగర్‌కు చెందిన చీమల తిరుపతి, రాగుల రాజశేఖర్, బోనగిరి రాకేష్‌లకు నేర చరిత్ర ఉందన్నారు. 2021లో ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారి మొగిలి హత్య కేసులో వీరు నిందితులు. ఈకేసు ప్రస్తుతం ట్రయల్‌కు వచ్చిందన్నారు. రాకేష్, రాజశేఖర్‌లు కేసు రాజీ చేసుకుందామని ప్రధాన నిందితుడు చీమల తిరుపతితో సంప్రదిస్తే రాజీ అవసరం లేదని, కేసు కొట్టుడు పోతుందంటూ దాట వేశాడన్నారు. ఈ విషయంలో ముగ్గురి మధ్య విభేదాలు తలెత్తాయని, మూడు రోజులుగా మాట్లాడుదామని పిలిచినా తిరుపతి స్పందించలేదని, కేసులో శిక్ష పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయని ఇద్దరు నిందితులు తిరుపతికి నచ్చజెప్పినా అతను ఒప్పుకోలేదన్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి నిర్వహిస్తున్న ఎస్‌ఎం ఆన్‌లైన్‌సెంటర్‌కు వచ్చిన నిందితులు అతనిపై కత్తులతో దాడిచేశారని తెలిపారు. నిందితులిద్దరిని గోదావరి సమీపంలోని సమ్మక్కసారలమ్మ గద్దెలవద్ద అరెస్టుచేశామని, వారినుంచి బైక్‌కత్తులు స్వాధీనపర్చుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ భూమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు సదానందం పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



రాజమ్మ(ఫైల్)

ఓదెల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజమ్మ(70) అనే వృద్ధురాలు పాము కాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఇంటిపనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు గాండ్ల సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కానరాని పర్యాటక శోభ

- అభివృద్ధికి నోచుకోని కొండగట్టు
- ప్రతిపాదన దశలోనే నిలిచిన రోప్‌వే
- కలగానే కోతుల పార్క్

మల్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన గుట్టలు.. వందలాది ఎకరాల భూములు.. పచ్చని చెట్లు.. ఝుమరిపించే అందాలు.. అన్నింటికీ మించి కోతుల కిచకిచలు.. ఇవి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రత్యేకత. కానీ పర్యాటకంగా అభివృద్ధి మాత్రం ఇక్కడ కనిపించదు. కొండగట్టు పుణ్య క్షేత్రానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. కొండగట్టు ప్రాంతం పర్యాటకంగా అన్ని విధాల ఎంతో అనుకూలం అయినప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉండటం పట్ల ఈ ప్రాంతవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంపై అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి పరుస్తామని హామీలు ఇచ్చిన నేతల మాటలు నీటిమూటలు అవుతున్నాయి. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొండగట్టు అంజన్న ఆలయం



రోప్‌వే ప్రతిపాదిత స్థలం

పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

కొండగట్టులో రోప్‌వే ఏర్పాటు పదేళ్లుగా ప్రతిపాదన దశలోనే మిగిలిపోయింది. మెట్లదారి నుంచి ప్రస్తుత పుష్కరిణి వెనుక వైపు వరకు తాడు మార్గం (రోప్ వే)కు అప్పట్లో రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. పర్యాటక శాఖ అధికారుల సైతం పలుమార్లు కొండగట్టును సందర్శించి రోప్‌వే కోసం పరిశీలన జరిపారు. రెవెన్యూ అధికారులు సుమారు 12 ఎకరాల మేర స్థలం కూడా కేటాయించారు. తదనంతరం దాని ఊసే లేకుండా పోయింది. రోప్ వే అయితే ఇక్కడ పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా దానిని పట్టించుకునే వారే కరువయ్యారు.

అమలుకు నోచుకోని హామీలు

కొండపైన కోతుల పార్క్ ఏర్పాటు చేయడం వలన వాటి సంరక్షణ, పెంపు తదితర అవకాశాలు ఉండగా అది అమలుకు ఆమడ దూరంలో ఉంది. ఆంజనేయ స్వామి ప్రతిరూపంగా కొండగట్టు దేవస్థానానికి వచ్చే భక్తులను విశేషంగా ఆకర్షించే కోతుల సంరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటి ఉనికి ప్రశ్నార్థంగా మారుతోంది. ఆహార అన్వేషణలో కొండ దిగి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కోతులు తరచుగా భారీ వాహనాల కింద పడి మరణిస్తున్నాయి. కొండగట్టు దేవస్థానం పరిధిలో గల కనీసం 200 ఎకరాలు భూమి కోతుల పార్క్ కోసం అవసరముండగా ఇందుకు కావాల్సిన నివేదికను అటవీ శాఖతో పాటు జంతు ప్రదర్శన (పర్యావరణ) శాఖ అధికారులు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే సమన్వయ లోపం, దేవాదాయ శాఖ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోతుల పార్క్ కలగానే మిగులుతోంది.



నమూనా రోప్‌వే

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతిచెందిన వృద్ధుడు

కరీంనగర్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు(60) శుక్రవారంరాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తెలిపారు. కరీంనగర్ కమాన్‌వద్ద అనారోగ్యంతో రోడ్డుపక్కన పడిఉన్న వృద్ధుడిని గతనెల25న 108అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స అందిస్తుండగా వృద్ధుడు మృతిచెందినట్లు తెలిపారు.మృతుడిని గుర్తించినవారు రెండోఠాణా, అవుట్‌పోస్ట్‌పోలీసులను సంప్రదించాలని కోరారు. వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

పుస్తెల తాడు ఇవ్వనందుకు భార్య హత్య

- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చడానికి భార్య మెడలోని బంగారుపుస్తెల తాడు అడిగితే ఇవ్వలేదని కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మమతను ఆమె భర్త అవుదుర్తి మహేందర్ ఉరివేసి హత్య చేశాడని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు మమతతో 20 సంవత్సరాలక్రితం వివాహం జరిగిందన్నారు. వీరిద్దరికి సంతానం లేకపోవటం, కుటుంబంలో ఆర్థిక పరమైన విషయాల్లో గొడవలు జరుగుతున్నాయన్నారు. సంతానం లేకపోవటంతో మహేందర్ తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడన్నారు. నిందితుడు ఏ పని చేయకపోవటంతో మమత షాపింగ్‌మాల్‌లో పనిచేసేదన్నారు. భార్య ఉద్యోగం చేయగా వచ్చే డబ్బులను నిందితుడు తీసుకునేవాడని డీఎస్పీ వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం బంగారు పుస్తెల తాడు ఇవ్వాలని అడుగగా మమత నిరాకరించిందన్నారు. భార్యను చంపితే పుస్తెల తాడు తీసుకోవచ్చునని పథకం వేశాడని డీఎస్పీ తెలిపారు. గత నెల 26న వేములవాడ, నల్లగొండ దైవ దర్శనాలకు వెళ్దామని నమ్మించి దర్శనాల అనంతరం మమతను మహేందర్ కొడిమ్యాలలోని ఇంటికి తీసుకువచ్చాడన్నారు. అనంతరం భార్య మెడ చుట్టు నైలాన్ తాడుతో ఉరి పెట్టి హత్య చేశాడన్నారు. ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు నైలాన్ తాడును ఇంటి స్లాబ్ హుక్‌కు కట్టాడన్నారు. అనంతరం పుస్తెల తాడు తీసుకొని గోల్డ్ లోన్ పెట్టి అప్పులను తీర్చుకున్నాడని డీఎస్పీ తెలిపారు. శనివారం మోటారు సైకిల్‌పై పారిపోతుండగా మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. మృతురాలి తల్లి రాచకొండ పద్మ ఫిర్యాదు మేరకు మహేందర్‌పై హత్య కేసు, మహేందర్ కుటుంబ సభ్యులపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుని వద్ద మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య ఉన్నారు.

కల్వచర్లలో మహిళ దారుణ హత్య



సమ్మక్క(ఫైల్)

రామగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కౌండిన్యనగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి మోటం సమ్మక్క(30) అనే మహిళ హత్యకు గురైంది. మంచిర్యాలజిల్లా తాండూరు ఐబీకాలనీ సమీపంలో పత్తి కనకరాజు అనే వ్యక్తితో సమ్మక్క కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. స్క్రాప్ వ్యాపారం చేస్తున్న వీరు తాండూరులో వ్యాపారం సజావుగా కొనసాగడం లేదని రెండు రోజులక్రితం కల్వచర్లలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. వ్యాపారంలో భాగంగా శుక్రవారం మంథని, కాటారం ప్రాంతంలో పర్యటించి రాత్రి కల్వచర్లకు చేరుకున్నారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆవేశంతో కనకరాజు అక్కడే ఉన్న సిమెంట్ బ్రిక్స్‌తో సమ్మక్క తలపై దాడి చేశాడు. ఈఘటనలో సమ్మక్క అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం కనకరాజు అక్కడినుంచి పరారయ్యాడు. కాగా మోటం సమ్మక్కకు గతంలో వివాహం జరగగా అనారోగ్య కారణంగా భర్త మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కనకరాజుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమ్మక్క తమ్ముడు తూర్పాటి మహేష్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిచెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన నాగవెల్లి బాలయ్య(70) అనే వృద్ధుడు శనివారం ఇంటి ఆవరణలోని మామిడిచెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అతని భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ కె రమేష్ పేర్కొన్నారు.

మరణంలో కూడా ఇద్దరికి చూపునిచ్చిన మహిళ



వినోద(ఫైల్)

సైదాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి మృతి చెందుతూ తన నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపునిచ్చింది. ఆ తల్లి మృతిచెందిన నేత్రాలు మాత్రం చూస్తూనే ఉంటాయి. సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన మద్దూరి వినోద (65) అనారోగ్యంతో మృతిచెందగా వారి కుమారుడు రాంచంద్రారెడ్డి, కూతుళ్లు, అల్లుళ్లు రమ-సంపత్ రెడ్డి, స్వప్న-పతీష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. దీంతో వరంగల్ ప్రాంతీయనేత్ర వైద్యశాలలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర టెక్నీషియన్ లక్ష్మన్ నేత్రాలను సేకరించారు. మృతురాలు నేత్రదానంద్వారా ఇద్దరు అంధులకు చూపురావడమే కాకుండా నేత్ర వైద్యవిద్యకు ఉపయోగ పడిందని తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅసోసియేషన్ వరంగల్‌జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, హన్మకొండ జిల్లా ప్రధానకార్యదర్శి జనార్దన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా..

వాహనాలను సీజ్ చేసిన అధికారులు



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఎక్స్‌కావేటర్

గన్నేరువరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కెనాల్ మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తాండ్రనరేష్ తెలిపారు. మండలంలోని గునుకుల కొండాపూర్ శివారులోని మిడ్‌మానేరు వరదకెనాల్ మట్టిని గునుకుల కొండాపూర్‌కు చెందిన గూడెల్లి నరేష్, జనగామ అనిల్, బూట్ల సతీష్ అక్రమంగా తరలిస్తున్నారన్న స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఆ ప్రదేశానికి వెళ్లి ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇరిగేషన్ ఏఈ మహేందర్ ఫిర్యాదు మేరకు వాహనాలను సీజ్‌చేసి యజమానులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే స్థానికులు తమ దృష్టికి తీసుకరావాలని ఇరిగేషన్ ఏఈ మహేందర్ సూచించారు.

ఆదివాసుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ప్రభుత్వం బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలి
- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

జమ్మికుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పని చేపట్టాలనుకున్నా వారి నిర్ణయానికి వ్యతిరేకంగా చేసే అధికారం లేదని శాంతిచర్చల కమిటీచైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వాటిని స్వయంగా ప్రభుత్వమే ఉల్లంఘిస్తూ ఆదివాసుల హక్కులకు విఘాతం కలిగించటం ప్రజాస్వామ్యబద్ధం కాదన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో శాంతిచర్చలను కోరుతూ మానవ హక్కుల వేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. రాజ్యాంగం ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవించే హక్కును కల్పించిందన్నారు. ఇది ఆదివాసులకు, మావోయిస్టులకు, పోలీస్‌వారికి అందరికీ వర్తిస్తుందన్నారు. తాము శాంతి చర్చల కమిటీగా ఏర్పడి మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి హింసను వీడనాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. మావోయిస్టులు తుపాకులు వినియోగించమని, చర్చల ద్వారా శాంతి ఏర్పడటానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారన్నారు. నెలరోజుల నుంచి వారు దానికి కట్టుబడి ఉంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వారిని చుట్టుముట్టి చంపివేయడానికి మరిన్ని బలగాలను పంపడం ఏ రకంగాను ధర్మం కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. చర్చల సమయంలో ఏ రకమైన షరతులైనా పెట్టవచ్చని, కానీ చర్చలకు ముందు షరతులు పెట్టడం భావ్యం కాదన్నారు. కర్రె గుట్టల్లో, ఛత్తీస్‌గడ్‌లో మోహరించిన బలగాలను.. మావోయిస్టులను చంపటానికి పంపకూడదని అన్నారు. చర్చల ప్రక్రియను ప్రారంభించాలని, అందుకోసం ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తమ గొంతు విప్పాలన్నారు. అన్నిరాజకీయ పార్టీలు సైతం వాటి రాజకీయ వైఖరీకు అతీతంగా సమస్యను శాంతియుతంగా మానవీయ మార్గంలో పరిష్కరించడానికి తమవంతుగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో దేశిని కోటి, మొలుగూరి సదయ్య, పింగిలి రమేష్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, కనుమల్ల విజయ, మిలుకూరి వాసుదేవరెడ్డి, బదావత్ రాజు, టి హరికృష్ణ, పందిళ్ల రంజిత్‌కుమార్, గుంటి సామ్రాజ్యం, మోహన్, దొడ్డె సమ్మయ్య, ఆవాల నరహరి, పుల్లూరి సంపత్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బాలుడి ప్రాణం మీదికి తెచ్చిన కోడిగుడ్డు

- ప్రాణాలు కాపాడిన 108టెక్నీషియన్



అస్వస్థతకు గురైన బాలుడితో తల్లిదండ్రులు

పాలకుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): యేడాది వయసు ఉన్న బాలుడు.. గొంతులో కోడిగుడ్డు ఇరుక్కుపోయి ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడికి 108సిబ్బంది చికిత్సఅందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లిజిల్లా పాలకుర్తిమండలం రాణాపూర్ గ్రామానికి చెందిన రాజేష్-అశ్విని దంపతుల కుమారుడు శ్రేయాన్స్(1) వంటగదిలోని పాత్రలో ఉన్న గుడ్డును నోట్లో వేసుకున్నాడు. అదికాస్త గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. దీంతో దిక్కుతోచని బాలుడి కుటుంబసభ్యులు హుటాహుటినపెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. శ్రేయాన్స్‌ను పరీక్షించిన వైద్యులు కరీంనగర్‌తీసుకెళ్లాలని సూచించారు. 108లో కరీంనగర్‌కు తరలిస్తుండగా బాలుడి పరిస్థితి విషమంగా మారింది. మార్గమధ్యలో 108టెక్నీషియన్ భానుప్రసాద్ బాలుడికి చౌకింగ్‌చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడాడు. బాలుడిని బ్యాక్‌స్లాబ్స్‌తో ఫుడ్‌పార్టికల్స్(వాంప్టింగ్)ద్వారా గుడ్డును బయటికి రప్పించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు108టెక్నీషియన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలభవన్ శిక్షణ తరగతులకు స్పందన



సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బాల భవన్ వేసవి శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. అబాకస్, శాస్త్రీయ నృత్యం, యోగా, చెస్, మృదంగం, నృత్యం, సంగీతం, మెహందీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్ విభాగాలతో పాటు ఈ యేడు కర్రసాములోకూడా శిక్షణ ఇస్తున్నారు. జూన్ 10వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 3 వరకు నమోదై దరఖాస్తులు చేసుకున్న 617 మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. ఈ నెలలో వచ్చే బాల బాలికలు ఆధార్ కార్డ్, ఫోటోతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.



శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

నరసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం


స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళవాయిద్యాలు వెంట రాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి, నిత్య హోమం, నిత్య కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, ధర్మకర్తలు అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ఎస్ వెంకటరావు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన ఆయా ఆలయాలకు నెలకు నాలుగు వేల రూపాయలు ధూప దీప, నైవేద్యాలకు, అర్చక గౌరవ భృతి కింద ఆరువేల రూపాయలు చెల్లిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను పాత జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో మాత్రమే ఈ నెల 25వ తేదీ లోపు సమర్పించాలని, వివరాలకు, దరఖాస్తు ఫారం కోసం దేవాదాయశాఖ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న బోధన



- పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం
- బొమ్మలు, ఇతర సామగ్రితో పాఠాలు

తిమ్మాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మొన్నటి దాకా అంగన్‌వాడీ కేంద్రాలంటే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడమే. కానీ ఇప్పు డు పిల్లలకు ఆటపాటలతోపాటు చదువు నేర్పే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రస్తుతం రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న బాలబాలికలకు అంగన్‌వాడీల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. వారికి అంకెలు, అక్షరాలు, ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారు.

● నూతన పాఠ్యాంశాలు

ప్రైవేట్ పాఠశాలల్లో విధంగా పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణంలో చిన్నారులకు విద్యతోపాటు పోషకాహారం అందించేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతోంది. దీనికోసం ప్రభుత్వం పూర్వ ప్రాథమికవిద్య బలోపేతమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఆటపాటలతో కూడిన బోధనను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆంగ్లమాధ్యంలో కొత్త అంశాలు, పాఠ్యాంశాలతో ప్రియదర్శిని పుస్తకాన్ని ప్రవేశపెట్టారు. ఆటపాటలు, బొమ్మలు, ఇతర సామగ్రి ద్వారా పిల్లలో అభ్యాసంపై ఆసక్తి పెరిగే విధంగా కృషి చేస్తున్నారు. దీంతో పిల్లలకు విద్యపై ఆసక్తిని పెరగడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛందంగా వస్తారు.

● అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ..

ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ విద్యలో శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా వారు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించే వీలుంటుంది. శిక్షణ ద్వారా అంగన్‌వాడీలకు నూతన విద్యా ప్రమాణాలపై పట్టువస్తుంది. ఎందుకంటే ఉపాధ్యాయుల్లో చాలామంది పది, ఇంటర్మీడియట్ చదివిన వారే ఉండడం, వారికి ఆంగ్ల బాష మీద పట్టు లేకపోవడంతో శిక్షణ వారిక ఎంతో ఉపయోగపడుతుంది.


అట్టముక్కలు, పేపర్లతో తయారు చేసిన ఇల్లు, చెట్లు, పరిసరాలు, బొమ్మలు

● ఆటపాటలతో..

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకో అంశాన్ని తీసుకొని విద్యార్థులకు బోధిస్తున్నారు. అదికూడా పనికి రాని వస్తువులు తీసుకొని వాటితో పలురకాలుగా విద్యార్థులకు నిత్యజీవితంలో ఉపయోగపడి, చూసే వాటిని తయారు చేయడం వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. పూల నుంచి వెలువడే సువాసనలు, పూల రంగులు, వాటి ఆకారం గురించి పిల్లలకు చూపిస్తు బోధిస్తున్నారు.సొంతంగా పలు రకాల పండ్లను అట్టలతో తయారు చేయడం వల్ల వారిలో పండ్ల రకాలు, వాటిలో లభించే పోషక విలువలు, వాటి రంగులు, వాటి ఆకారాలు తెలియజేస్తున్నారు. మట్టితో కూరగాయలు, పండ్లు తయారు చేయించడం వాటికి రంగుల వేయించడం చేస్తున్నారు. పాలడబ్బాలతో, పేపర్‌తో క్యాలెండర్, గడియారం తయారు చేయించడం వాటిని చూపించి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలను ఇసుకతో, చింత గింజలతో పేర్చడం ద్వారా అక్షరాలను చూపెడుతూ నేర్పిస్తున్నారు.పిల్లలకు వాహనాల గురించి తెలిపేందుకు ఏ వాహనం ఎలా ఉంటుందో, ఆ వాహనాం ఎలా నడుస్తుందో మట్టితో తయారు చేయిస్తూ పిల్లలకు తెలుపుతున్నారు. చిన్ననాటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు ప్లాస్టిక్ టీకప్పులతో ట్రాఫిక్‌లైట్లను, సిగ్నల్స్‌ను తయారు చేసి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. అట్ట ముక్కలు, పేపర్స్, దూది, మట్టి, గడ్డి, గాజు తదితర వస్తువులతో వివిధ శరీరభాగాలను తయారుచేసి పిల్లలకు అవయవాల గురించి తెలియజేస్తున్నారు. కుటుంబం అంటే ఏంటి అందులో ఉండే వ్యక్తులు అమ్మ, నాన్న, ఇల్లు, రక్త సంబంధీకులు గురించి అవగాహన కల్పిస్తున్నారు. జంతువుల బొమ్మలు తయారు చేసి వాటిపై అవగహన కల్పిస్తున్నారు.

సొంతంగా తయారు చేసిన ఉపకరణాలతో బోధిస్తున్నాం..

- శ్రీమతి, సీడీపీవో, కరీంనగర్ రూరల్..



గతానికి భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యబోధన జరుగుతోంది. పిల్లల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలనే ఆసక్తి పెరిగింది. ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆడుతూ, పాడుతూ విద్యబుద్ధులు నేర్చుకుంటున్నారు. చిన్ననాటి నుంచే సమాజంపై పిల్లలకు ఒక అంచనా ఏర్పడుతోంది. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలతో వస్తువులను తయారు చేయించడం వాటిపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. నెలకో కొత్త అంశాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు.



▼▲ వివిధ రకాల బొమ్మలు




మన ఊరు తెలియజేసే విధంగా మట్టి, వివిధ వస్తువులతో తయారు చేసిన అంశం

రాష్ట్రస్థాయి అన్నమయ్య కీర్తనల పోటీలు

-విజేతలకు బహుమతులు అందజేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


విజేతలతో ముఖ్య అతిథి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, స్వరమాధురి సంస్థలు సంయుక్తంగా కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ కోదండరామాలయంలో శనివారం రాష్ట్రస్థాయిలో అన్నమాచార్య కీర్తనల పోటీలు నిర్వహించారు. విజేతల బహుమతి ప్రదానోత్సవానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలు జరిపిన నిర్వాహకులకు, పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 10 జిల్లాల నుంచి 200 మంది పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. స్వరమాధురి సంస్థ అధ్యక్షుడు కేవీ శర్మ, సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అన్నమయ్య జీవితం, సంకీర్తనల సారం అంశాలపై మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద సబ్‌జూనియర్స్ విభాగంలో నిధిచంద్రిక, భవిష, అనిరుధ్, జూనియర్స్ విభాగంలో అభిరాం, సింధుశ్రీ, సీనియర్స్ విభాగంలో భాస్వంత్‌శర్మ, సుష్మిత, జ్యోతి, సూపర్ సీనియర్ విభాగంలో సుదర్శన్, శంకర్, సుధాకర్ బహుమతులు అందుకున్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

జగిత్యాల అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన దండుగుల నవీన్ అనే నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..

దండుగుల నవీన్ అనే యువకుడు జగిత్యాల పట్టణంలోని జమ్మి గద్దె ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా లక్ష్మీ ట్రావెల్స్‌ను ఏర్పాటు చేశా డు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో జగిత్యాల పట్టణ ఎస్‌ఐ గీత ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మీ ట్రావెల్స్‌కు వెళ్లి తనిఖీ చేశారు. నవీన్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా ఒక గది అద్దెకు తీసుకుని అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసగిస్తున్నాడని విచారణలో తేలింది. దీంతో సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

అంతర్జాతీయంగా పాక్ ఒంటరి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సమావేశంలో పాల్గొన్న ప్రజలు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా పాక్ ఒంటరిగా మిగిలిందని, భారత్ స్నేహహస్తం అందిస్తుంటే పాక్ మాత్రం దుర్బుద్ధితో దాడిచేయడం గర్హనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ బృందావన్ గార్డెన్‌లో 'పహల్గాం ఘటనా అనంతరం భారత్ వ్యూహాత్మక అడుగులు-పరిణామాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. కాశ్మీర్ భారత్‌లో ఎప్పటికీ అంతర్భాగమేనని అన్నారు. దేశానికి ఒకే రాజ్యాంగం, చట్టం ఉంటుందని దాన్ని ఎవరూ చెరిపేయలేరని అన్నారు. సుప్రీంకోర్టు కూడా ఆర్టికల్ 370 రద్దును సమర్థించిందని గుర్తుచేశారు. కాశ్మీరులో జరుగుతున్న అభివృద్ధి ని చూసి పీవోకేలోని యువత తాము భారత్ వాసులమేనని ఉద్యమాలు చేయడం, ఇటీవల పాక్‌కు అమెరికాకు సంబంధాలు చెడిపోవడం, పాక్ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవడంతో అక్కసును భారతదేశంపై చూపించడం జరిగిందని అన్నారు.

గల్ఫ్ దేశాలు కూడా భారత్‌తో సత్సంబంధాలు నెరపడం కొందరికి మింగుడు పడటం లేదని తెలిపారు. నేడు అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అయిందని అన్నారు. తాలిబన్లు, ఇరానియన్లు, ప్రపంచమంతా భారత్ వైపే ఉండటం, పాక్‌లో ఆహార కొరత, అక్కడి ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత రావడంతో వీటన్నిటిని డైవర్ట్ చేసేందుకు మతం ఆధారంగా ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నారని అన్నారు. ప్రధాని మోదీ విమానాశ్రయంలోనే వివిధ సైన్యాధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి ఒక ధైర్యాన్ని నింపడం గొప్ప విషయమని అన్నారు. పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడం యుద్ధ నీతిలో ఒక భాగమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గాజుల రవీందర్, డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, డి నిరంజనాచారి, బిఎస్ శర్మ, సముద్రాల నాగేశ్వరరావు, మందల నగేశ్‌రెడ్డి, జె సత్యనారాయణరెడ్డి, దేశిని శ్రీనివాస్, వెచ్చ మురళి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, ఎలగందుల సత్యనారాయణ, నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవ్వు ఓ వరం..

● నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : నవ్వడం ఒక యోగం... నవ్వించడం ఒక భోగం... నవ్వకపోవడం ఒక రోగం... అంటారు పెద్దలు. ఎంతటి శత్రువునైనా నవ్వుతో పలకరిస్తే జయించవచ్చు. నవ్వు వ్యక్తి ముఖ కవళికలు, భావోద్వేగాలపై ప్రభావం చూపుతాయి. వరంలాంటి నవ్వు



నిండు ముఖానికి ఎంతో అందం, ఆనందం, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.నేటి యాంత్రిక జీవితంలో నిత్యం ఎంతో కొంతసేపు నవ్వితేగాని ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం, ప్రేమ, అభిమానాలు అందవు. ఈ దిశలో నవ్వు ప్రాధాన్యాన్ని తెలిపే ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ప్రతీయేటా మే నెల మొదటి ఆదివారం జరుపుకుంటారు.

● నేపథ్యం...

ఈ దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం జరుపుకునే వారు. చాలా దేశాల్లో జనవరిలో చలి వాతావరణం ఎక్కువగా ఉండడంతో ఈ తేదీని మార్చాలని నవ్వుల ప్రియులు కోరారు. లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నిర్వహించాలని నిర్ణయించారు. స్లీవ్ విల్సన్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త మొదట తన వృత్తిలో భాగంగా హాస్యానికి మానవుల మానసిక ప్రవృత్తికిగల సంబంధాల మీద పరిశోధనలు చేస్తూ వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. 1997లో ఇండస్ ఫౌండేషన్ అనే భారతీయ సంస్థ టూ క్రియేట్ ఏ పాజిటివ్ వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశం మీద ప్రసంగించడానికి భారత్‌కు ఆహ్వానించింది. అప్పటికే ముంబాయిలో జూహు బీచ్ లాఫ్టర్స్ క్లబ్ డాక్టర్ మదన్ కతారియా నెలకొల్పాడు. ఈ క్లబ్‌ను హాస్య యోగా అని పిలిచారు. 1998 జులైలో విల్సన్‌తో కలిసి వరల్డ్ లాఫ్టర్ టూర్‌ను నిర్వహించారు. దీంతో నవ్వుల దినోత్సవానికి అంతర్జాతీయ ప్రచారం లభించింది. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగేన్ 2000 జనవరి తొమ్మిదిన నిర్వహించారు. ఈ ఉత్సవం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదైంది. దీంతో మొదట జనవరిలో నిర్వహించిన నవ్వుల దినోత్సవం 2004 నుంచి మే మొదటి ఆదివారానికి మార్చారు. నవ్వుల యోగా ఉద్యమం ప్రస్తుతం 115 కంటే ఎక్కువ దేశాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా దేశాల్లో వేలాది లాఫింగ్ క్లబ్‌లను నిర్వహిస్తున్నారు.

● నవ్వుతో ప్రయోజనాలు

నవ్వు మన శరీరంలో సానుకూల రసాయనాలను విడుదల చేస్తుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. సంతోషంగా ఉండేందుకు సహకరిస్తుంది. ప్రపంచ శాంతి పెంపొందించేందుకు తోడ్పడుతుంది. గాఢమైన నవ్వు లోతైన శ్వాసను ఉత్తేజపరచి ఆక్సిజన్ ప్రవాహం పెంచుతుంది. కండరాలను సడలించడానికి కారణమౌతుంది. రోగ నిరోధక శక్తి పెంచుతుంది. నిరాశా భావాల్ని ఎదుర్కోవడంలో సహకరిస్తుంది. విభిన్న సంస్కృతులు, నేపథ్యాల ప్రజలను ఏకం చేస్తుంది.

● జరుపుకునే విధానం...

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సమావేశమై నవ్వుతూ యోగాభ్యాసం చేస్తారు. కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు, సహచరులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, ఎవరైనా వ్యక్తులు పరస్పరం కలుసుకున్నపుడు నవ్వుతూ మాట్లాడుకోవడం కూడా ఓ పద్ధతి. అందుకే నవ్వుల యోగా సెషన్‌లు, కామెడీ షోలు, నవ్వుల ఫ్లాష్ మాబ్స్, నవ్వుల నేపథ్య పార్టీలు, నవ్వుల పవాళ్ళు, నవ్వుల వర్క్‌షాప్‌లు జరుపుకుంటారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

గణేశ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా పట్టించుకోవడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై రేవంత్‌రెడ్డి మాటలు ఉత్తవే అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్నామని ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబోమని ప్రైవేటు కళాశాలలు ప్రకటించాయన్నారు. ఇప్పటికే యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరీక్షలు సరైన సమయంలో జరగకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు బకాయిలు విడుదల చేసి పరీక్షల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, వినయ్, శ్రవణ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు తెల్లవారుజామున ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం సంకల్పపూజతో పాటుగా శివకల్యాణ పూజ పరివార దేవతాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు, ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంజన్న ఆలయంలో కోలాహలం..

మల్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి స్వామి వారి భక్తులు హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఇనుకొండ చంద్రరెడ్డి కుటుంబసభ్యులు లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ మేరకు అన్నదాన నిర్వహకులు రాజేందర్‌రెడ్డి, రవిందర్‌కు విరాళం సొమ్ములు అందించగా వారు రశీదు అందించారు.


కొండగట్టులో నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో విద్యుదాఘాతంతో కొడిపాక దుర్గాప్రసాద్(23) అనే యువకుడు మృతిచెందినట్లు కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. భగత్‌నగర్‌కు చెందిన కొడిపాక దుర్గాప్రసాద్ శనివారం తన ఇంటిలో కూలర్‌పెట్టుకునే క్రమంలో విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడి తండ్రి కొడిపాక కష్ణమూర్తి భూపాలపల్లి రిజర్వ్ హెడ్‌కా నిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా నిలుస్తున్నాయని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో శనివారం వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సమ్మె నోటీసు అందజేత

భగత్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని పారిశ్రామిక కంపెనీల్లో ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం వివిధ సంస్థలకు అందించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, మడిపల్లిమహేందర్, అశోక్, గురుభూషణ్ పాల్గొన్నారు.

కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

కరీంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో రెండు రోజులుగా పెద్దపల్లి జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన 35 మంది పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందించారు.కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, కరీంనగర్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఇంచార్జి రాంబాబు ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

భగత్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొత్తపల్లి తహసీల్దార్ వెంకటలక్ష్మిని పశ్చిమ జోన్ బీజేపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈకార్యక్రమంలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, పొన్నాల రాము ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

భగత్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎలగందల్‌మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ మోడల్ స్కూల్‌లో 2025-26 సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు.

విద్య, ఉపాధి హక్కుల కోసం నిరంతరం ఉద్యమించాలి

భగత్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధి హక్కుల కోసం నిరంతరం ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయిని అశోక్ అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ విద్య, ఉపాధి అవకాశాలు అందరికీ అందకపోవడం బాధాకరమన్నారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావం నుంచి దేశవ్యాప్తంగా అనేక సమస్యలపై నిరంతరాయంగా ఉద్యమాలు చేస్తున్న ఏకైక సంఘం ఏఐవైఎఫ్ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి యుగేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోనగిరి మహేందర్, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు బూడిద సదాశివ, నాయకులు సాంబరాజు, హేమంత్, అరవింద్, రాజు, అజయ్, చందు, రమేష్, సురేష్, బాబు వినయ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయిని అశోక్

నీట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు : సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలో నిర్వహించనున్న నీట్ (యూజీ) పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 పరీక్ష కేంద్రాలలో మొత్తం 2,975 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. దాదాపు 150 మంది పోలీసు అధికారులను ఈ బందోబస్తుకు కేటాయించామన్నారు. ఏసీపీ మాధవిని పరీక్షకు నోడల్ అధికారిగా నియమించామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసు శాఖ తరుపున అవసరమైన అన్ని పటిష్ట చర్యలు చేపట్టామని పోలీసు కమీషనర్ తెలిపారు.

కరీంనగర్‌లో ఈ నెల 7న జాబ్ మేళా

కరీంనగర్ అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌లోని మెడ్జిల్ కెఎల్ గ్రూపులో ఉద్యోగాల కల్పనకు ఈ నెల 7న కరీంనగర్‌లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. కశ్మీరగడ్డ మీ సేవ కార్యాలయం పై అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో 7న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు. 10వ తరగతి, ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగులు అర్హులుగా పేర్కొన్నారు. వివరాలకు 7207659969, 6309518695, 7093172221 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక పూర్తి

కరీంనగర్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద అంటించారు. కరీంనగర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 3,411 మంది దరఖాస్తు చేసుకున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో 1,081 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. చామనపల్లిలో 142 మంది , చేగుర్తి 111, చెర్లబూ త్కూర్‌లో 199 మంది, దుబ్బపల్లి 34, ఎలబోతారం 65, ఫకీర్‌పేట 34, ఇరుకుల్ల 53, జూబ్లీనగర్ 48, మందులపల్లి 21, మొగ్దుంపూర్ 132, నగునూర్ 168, నల్లగుంటపల్లి 24, తహెర్ కొండాపూర్ 30 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. బహదూర్‌ఖాన్‌పేటలో మొత్తం 106మంది అర్హులను గుర్తించారు. ఇందులో కేవలం 55 మంది ఇళ్ల మాత్రమే నిర్మాణాలు చేపట్టారు. మిగతావారు నిర్మించుకోలేమని తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వరసిద్ధి కాలనీవాసులు

డంపుయార్డును తరలించాలి

కరీంనగర్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): డంపుయార్డు హటావో... కోతిరాంపూర్ బచావో నినాదంతో నగరంలోని కోతిరాంపూర్ వరసిద్ధి కాలనీవాసులు శనివారం ఆందోళన చేపట్టారు. ఉదయం ర్యాలీ నిర్వహించి డంపు యార్డు వద్ద చెత్త తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. ఎండ తీవ్రతతో యార్డు వద్ద నిత్యం మంటలు చెలరేగుతున్నాయని, దట్టమైన పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గణేశ్‌నగర్,మే3 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ, పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు క్రిస్టియన్‌కాలనీ చర్చి ప్రాంతం, విజయ మోహన్‌రెడ్డి ఆసుపత్రి ప్రాంతం, సవరన్ వీధి, సివిల్ ఆసుపత్రి వెనుక వైపు ప్రాంతం, రెడ్డి నివాస ప్రాంతం, రామ్‌రాజ్ కాటన్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కరీంనగర్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): తమ తండ్రిని బతికించుకోవడానికి ఇద్దరు చిన్నారులు పడుతన్న కష్టం చూసి చలించిపోయిన మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లాలోని శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ మల్టిపుల్ ఆర్గన్స్ ఫెయిల్ అయి 12 సంవత్సరాల నుంచి మంచానికే పరిమితం అయ్యాడు. ఆయన ఆరోగ్యం కోసం ఇల్లు, బంగారం అమ్మి 15 లక్షలు ఆసుపత్రిలో ఖర్చు చేశారు. దీంతో ఆయన భార్య మమత, ఇద్దరు ఆడపిల్లలు ప్రవస్తి, ప్రశస్తి రోడ్డున పడ్డారు. ప్రస్తుతం నగరంలోని కిసాన్‌నగర్‌లో చిన్న రేకులషెడ్డులో తలదాచుకుంటుకున్నారు. విషయం తెలుసుకున్న కొత్త జయపాల్‌రెడ్డి ఆ కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన యూట్యూబర్ గంగవ్వ

కరీంనగర్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం కార్యక్రమాల్లో యూట్యూబ్ స్టార్ గంగవ్వ, రాజులు భాగస్వాములయ్యారు. శనివారం నగరంలోని లక్ష్మీనగర్, రాంనగర్, హౌసింగ్ బోర్డుకాలనీ ప్రాంతాల్లో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పర్యటించి పారిశుధ్య పనులను వీక్షించారు. నగరపాలక సంస్థ ద్వారా పారిశుధ్య విభాగంలో ప్రతిరోజు చేసే పరిశుభ్రత పనులు, స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్, సెగ్రిగేషన్, కంపోస్టింగ్ తయారీపై గంగవ్వ, రాజులకు కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా గంగవ్వ మాట్లాడుతూ ప్రజలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో చెత్తను ఆకుపచ్చ, నీలంరంగు, ఎరుపు రంగు డబ్బాల ద్వారా మూడు రకాలుగా వేరు చేసి కార్మికులకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తడి చెత్తను ఇంట్లో కంపోస్టు ఎరువుగా తయారు చేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌తో కలిసి పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న గంగవ్వ, రాజు

వాణిజ్య కేంద్రంగా పూలే పార్క్

(1వ పేజీ తరువాయి)

అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా తిరిగి ఈ మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు అనుమతి ఇచారు.. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పార్కులో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ అనుమతి రద్దు చేయాలని వాకర్స్ కోరుతున్నారు.



ఎగ్జిబిషన్‌ను రద్దు చేయాలి

- సీహెచ్ రవీందర్, లెజెండ్స్ వాకర్స్ సంఘం అధ్యక్షులు

జ్యోతిబాపూలే వాకింగ్ ట్రాక్‌పై ఉదయం, సాయంత్రం 1200 మంది వాకింగ్ చేస్తారు. పూలే మైదానంలో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌ను రద్దు చేయాలి. ఎగ్జిబిషన్ నిర్వహణతో వాకింగ్ ట్రాక్ పూర్తిగా దెబ్బతింటుంది. మైదానం పూర్తిగా క్రీడలకు కేంద్రంగా ఉండేది.



● నిరసన తెలుపుతాం..

- జిల్లా అంజయ్య, లెజెన్స్ వాకర్స్ సంఘ కార్యదర్శి

జ్యోతిబాపూలే పార్కును మొత్తం కమర్షియల్ కేంద్రంగా మారుస్తున్నారు. నగరవాసులకు ఆనందాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన పార్కులో ఎగ్జిబిషన్ నిర్వహించడం బాధాకరం. ఎగ్జిబిషన్ రద్దు చేయకుంటే నిరసన తెలుపుతాం.

నేటి నుంచి ప్రజ్ఞ ఉచిత వేసవి శిక్షణ శిబిరం

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 3: వేసవి శిక్షణలో భాగంగా చిన్న జీయరుస్వామి ఆశీస్సులతో వికాసతరంగిణి ఆధ్వర్యంలో సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో ఆదివారం నుంచి 18వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు 8 నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు ప్రజ్ఞ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9866111100, 9441439338 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్న అధికారులు

గణేశ్‌నగర్,మే3(ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులు ప్రైవేట్ కళాశాల, పాఠశాలలో శిక్షణ శిబిరాలు, క్రీడా ఉత్సవాలు చేపట్టి ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత సమ్మర్ క్యాంపులను ప్రభుత్వ పాఠశాల్లో మాత్రమే నిర్వహించాలన్నారు.

బైపాస్‌రోడ్డు డంపుయార్డును తరలించాలి

భగత్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): బైపాస్‌రోడ్డు లోని డంపుయార్డును వెంటనే తరలించాలని సీపీఐ నగర శాఖకార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డంప్‌యార్డు నుంచి వచ్చే పొగను వెంటనే ఆర్పివేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డంప్‌యార్డు మిషనరీ కుంభకోణంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం

కరీంనగర్ రూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన వేముల లావణ్య-రామకృష్ణల పెద్ద కుమార్తె వేముల రశ్మిత ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ సెకండియర్ ఫలితాల్లో 1000 మార్కులకు 995 మార్కులు (ఎంపీసీ)సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రశ్మితను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. దుర్శేడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర హరీష్ గౌడ్, మాజీ సర్పంచ్ గాజుల అంజయ్య, మండల ఉపాధ్యక్షుడు పాలకుర్తి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో అత్యాధునిక క్రికెట్ స్టేడియం నిర్మాణం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ క్రికెట్ క్రీడాకారుల కోసం కరీంనగర్‌లో త్వరలో అత్యాధునిక క్రికెట్ స్టేడియం నిర్మాణం జరగనుందని కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌కు సమీపంలోని అల్గునూరు ప్రాంతంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అకాడమీ మైదానాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మాజీ మేయర్ వై సునీల్‌రావు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగమరావుతో కలిసి పనులు పరిశీలించారు.

సరస్వతి శిశుమందిర్ కార్యవర్గం ఎంపిక

భగత్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్, ఇంగ్లీష్‌మీడియం పాఠశాల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కరుణాకర్‌రావు, ఉపాధ్యక్షులుగా గోలి పూర్ణచందర్, కార్యదర్శిగా ఇంజినీర్ కోల అన్నారెడ్డి, సహాయ కార్యదర్శిగా కొత్తూరి ముకుందం, కోశాధికారిగా గట్టు రాంప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

విద్యుత్ భద్రత నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలి: ట్రాన్స్‌కో డీఈ

హుజూరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌భద్రత నియమాలను ప్రతిఒక్కరూ పాటించినప్పుడే ప్రమాదాలు జరగవని హుజూరాబాద్ డివిజన్ ఇంజనీర్(ఆపరేషన్స్) ఎస్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో విద్యుత్‌భద్రతపై వినియోగదారులు, విద్యుత్‌సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏదైనా అవసరం ఉన్నప్పుడు టెక్నీషియన్ పిలిపించుకొని మరమ్మతు చేయించుకోవాలన్నారు. విద్యుత్ సిబ్బందికూడా భద్రత మార్గదర్శకాలను పాటించాలన్నారు. అనంతరం విద్యుత్‌భద్రత పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డీఈ ఉపేందర్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై విచారణ

వీణవంక, మే 3 (ఆంధ్రజ్యోతి): చల్లూరు ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంపై శనివారం జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్ విచారణ చేపట్టారు. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ముదిగంటి రఘునాథ్‌రెడ్డి.. ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి కొంతమంది దుకాణలు ఏర్పాటు చేశారని సీఎంవోలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించినఅధికారులు శనివారం మండల అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. గ్రామంలోని దుకాణదారులను విచారించి 1996లో షాపులు నిర్మించినట్టు తెలిసినట్టు ఉన్నతాధికారులకు నివేదిక అందిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరుగు శ్రీధర్, ఎంఈవో శోభరాణి, ఎంపీవోసురేందర్ చిరువ్యాపారులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించింది.. యువతకు స్ఫూర్తినిచ్చింది..

● ప్రశంసలు అందుకుంటున్న మానస


మానస

హుజూరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామానికి చెందిన బత్తుల మల్లేశం-నర్మద దంపతుల చిన్నకూతురు మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై పలువురి ప్రశంసలు అందుకుంటోంది. మానసకు చిన్నప్పటి నుంచే చదువుమీద ఆసక్తి ఉండేది. చదువుకోవడానికి ఆర్థికపరిస్థితి లేకపోవడంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మానస మేనత్త ఉమాదేవి-మనోజ్ చేరదీశారు. మానస చదువుకోవడానికి ఆర్థికంగా సహాయపడ్డారు. మానస ఎల్కతుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమహాస్టల్‌లో పదోతరగతి వరకు చదువుకుంది. ఆతర్వాత ఇంటర్, డిగ్రీ హుజూరాబాద్‌లో పూర్తిచేసింది. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ సోషయాలజీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జూనియర్‌సివిల్‌జడ్జి ఫలితాల్లో ఎంపికై పలువురి ప్రశంసలందుకుంటోంది.

మానకొండూర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పోచంపల్లిలో శనివారం రాత్రి కలశాంజ్ ఇంటర్నేషనల్ పాఠశాల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ జడ్జి చంద్రయ్య, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు కోసం పోరాడాలి

రామడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుకు కార్యకర్తలు పోరాడాలనిసీపీఐజిల్లా కార్యవర్గసభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం రామడుగులో సీపీఐగ్రామశాఖసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలని ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని కలిగించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గొడిశాల తిరుపతిగౌడ్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు గుర్తింపు: వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): పార్టీకోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు రాబోయే రోజుల్లో గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్రపరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయి రూపాగార్డెన్‌లో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అధ్యక్షతన పార్టీనిర్మాణ, సంస్థాగత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుఫున నిలబడిన వ్యక్తులను గెలిపించుకోవాలన్నారు. కార్యకర్తలు మరింత కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషిచేయాల న్నారు. అనంతరం శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డిని సన్మానించారు. సమావేశంలో పీసీసీ మెంబర్లు పత్తి కృష్ణారెడ్డి, భగవాన్‌రెడ్డి, మండలాలు, పట్టణాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులను సన్మానిస్తున్న వొడితెల ప్రణవ్

బొమ్మనపల్లిలో స్థల పరిశీలన చేసిన అధికారులు

చిగురుమామిడి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లిలో రైతుఐక్యవేదిక, ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు సర్వేనంబరు 685స్థలాన్ని శనివారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, డిప్యూటీసర్వే అధికారుల బృందం పరిశీలించింది. రైతులకు, గ్రామస్థులకు న్యాయంచేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. తమ గోడును ఆలకించి అధికారుల బృందాన్ని పంపించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రుణపడి ఉంటామని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దసాని రమేష్, మండల సర్వేయర్, గ్రామమహిళా సమైఖ్య సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

వక్ఫ్ సవరణ చట్టంపై అనవసర రాద్ధాంతం

మానకొండూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఇటీవల తీసుకవచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై కొందరు అనవసర రాద్ధాంతం చేయడం బాధాకరమని బీజేపీ జిల్లాఅధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలింబోర్డు సభ్యుడు బొంతల కళ్యాణ్‌చంద్ర అన్నారు. మానకొండూర్‌లో ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టంద్వారా పేద ముస్లింలకు అన్యాయం జరుగుందనే ఉద్దేశ్యంతో మోడీ సర్కార్ సవరణలు చేసిందన్నారు. ఈ విషయంలో కొంత మంది పని గట్టుకొని ముస్లిం సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, ఎం లక్ష్మణాచారి, ఎం కోటేశ్వర్, నందగిరి బలరాం, కార్యకర్తలు ఉన్నారు.

లీకైన మిషన్ భగీరథ పైపులైన్

● వృథాగా పోతున్న నీరు..

● పట్టించుకోని అధికారులు..

చిగురుమామిడి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఎదుట మిషన్‌భగీరథ పైపులైన్ రెండు రోజుల క్రితం లీకైంది. నీరంతా వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వృథాగాపోతున్న నీటితో పాఠశాల ఎదుట బురదమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు వెంటనే పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ఇల్లందకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లసర్వేలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని రాచపల్లి గ్రామస్థులు శనివారం ఎంపీడీవో పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాచపల్లి గ్రామంలో ఇందిరమ్మఇళ్ల మంజూరైన ఫైనల్‌లిస్టులో కొందరు అనర్హులున్నారన్నారు. వీరికిగతంలో ఇళ్లు మంజూరయ్యాయని, కొందరికి పక్కాఇళ్లు కూడా ఉన్నాయన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి గ్రామంలో అర్హులైనవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రశాంతంగా ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఎప్‌సెట్ పరీక్షలకు కరీంనగర్ జోన్ పరిధిలో మొత్తం 12పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. కరీంనగర్ జోన్ పరిధిలోని 12కేంద్రాల్లో రెండు సెషన్‌లలో కలిపి మొత్తంగా 4420 మంది అభ్యర్థులకుగాను 4261 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 159 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

గంగాధర, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు ప్రభుత్వ పథకాలను పొందేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఫార్మర్‌రిజిస్ట్రీలో తప్పనిసరిగా వివరాలను నమోదు చేసుకోవాలని చొప్పదండి ఏడీఏ ప్రియదర్శిని తెలిపారు. శనివారం ఆమె గంగాధర ఏడీఏ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 5నుంచి జూన్4వరకు రైతు గుర్తింపుకార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేస్తున్నట్లు తెలిపారు. గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లోని 16 రైతు వేదికల్లో ఏఈవో వద్ద రైతుల వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్‌తో రైతుకు గుర్తింపు కార్డు అందిస్తామని దీనితో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం జిరాక్సు,ఆధార్ లింకు చేయబడిన ఫోన్ నెంబరుతో ఏఈవోలను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాల న్నారు. ఈ సందర్భంగా మూడు మండలాల్లో రైతు వేదికల్లో జరిగే రిజిస్ట్రేషన్ తేదీలను ఆమె విడుదల చేశారు.

పహల్గాం మృతులకు టీడీపీ నివాళి

గంగాధర, మే 3 (ఆంధ్రజ్యోతి): పహల్గాం మృతులకు టీడీపీనాయకులు శనివారం నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు మల్కారంరాజేశం మాట్లాడుతూ ఉగ్రదాడిలో గాయపడిన వారుత్వరగా కోలుకోవాలని కోరారు.

ఎంపీ నిధులతో బోర్లు

మానకొండూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్, వేగురుపల్లిగ్రామాల్లో కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రత్యేకనిధులతో బోర్లు మంజూరుకాగా శనివారం ప్రారంభించారు.

కాంగ్రెస్ పరిశీలకులను సన్మానించిన దేశిని

జమ్మికుంట రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత, నిర్మాణ సన్నాహక విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ పరిశీల కులు నమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్‌బాబును సీనియర్ నాయకులు దేశిని కోటి, జిల్లెల తిరుపతిరెడ్డి, బొంగోని వీరన్న ఘనంగా సన్మానించారు.

తహసీల్దార్‌ను సన్మానించిన చైర్‌పర్సన్

జమ్మికుంట రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ రాజును మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, అడ్తీదారుల సంఘం అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్‌రావుశనివాంరం ఘనంగాసన్మానించారు.

డ్రగ్స్ నిర్మూలనపై పోరుయాత్ర

సైదాపూర్, మే 3: మండలంలోని అమ్మనగుర్తి, బొమ్మకల్, గొడిశాల, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాములపల్లి,ఎలబోతారం గ్రామాల్లో శనివారం డ్రగ్స్‌నిర్మూలన పోరుయాత్ర నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు డ్రగ్స్‌బారిన పడకుండా చూడాలన్నారు.

ప్రారంభమైన ఇంటర్ అడ్మిషన్లు

చిగురుమామిడి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో 2025-2026గాను ఇంటర్మీయట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రతి గ్రూపులో 40సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 5మే నుంచి 20మేవరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.